క్లుప్తంగా

శనీశ్వరుని సన్నిధిలో ఎస్పీ రాహుల్‌కుమార్


శనీశ్వరస్వామి పూజల్లో పాల్గొన్న ఎస్పీ రాహుల్‌కుమార్

పావగడ: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని తుమకూరు జిల్లా ఎస్పీ రాహుల్‌కుమార్ శహపుర్వాడ్ ఆదివారం స్థానిక శనీశ్వరాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ సమితి అధ్యక్షుడు ఆనందరావు, కార్యదర్శి సుబ్బనరసింహ, కేవీ శ్రీనివాస్ తదితర పదాధికారులు ఆలయ మర్యాదలతో ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ శనీశ్వరస్వామిని దర్శించుకుని సర్వ సేవా పూజలు నిర్వహించారు. శీతలాంబదేవికి కుంకుమ పూజలు చేశారు. పదాధికారులు ఎస్పీకి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. స్థానిక పట్టణ సీఐ సురేశ్, రూరల్ సీఐ గిరీశ్, ఎస్ఐ గురునాథ్ తదితర పోలీసులు ఉన్నారు.

రాష్ట్ర సహాయ కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి


నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాసరెడ్డి

హిందూపురం: ఏపీ రెడ్డిసంక్షేమ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మోత్కుపల్లి శ్రీనివాసరెడ్డి ఎంపికయ్యారు. ఆయన ఆదివారం గుంటూరులో నియామక పత్రం అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ రెడ్డి సంక్షేమ సంఘం అభ్యున్నతి, సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘం అధ్యక్షుడు నరేష్‌కుమార్‌రెడ్డి, గౌరవధ్యక్షుడు బయపరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలు అందిస్తున్న పీడీ సాయికృష్ణ

గుడిబండ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ సాయికృష్ణ మండలంలోని జంబులబండ, కేకాతి, కల్లురొప్పం, మైనిగానిపల్లి గ్రామాల్లో ఉన్న దివ్యాంగులకు తన సొంత నిధులతో నిత్యావసరాలు, దుస్తులు, మందులు ఆయా గ్రామాలకు వెళ్లి పంపిణీ చేశారు. అనంతరం పిల్లలకు రోజూ స్నానం చేయించాలని దివ్యాంగుల తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో పీఈటీ అజార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

హిందూపురం అర్బన్: ఆరోగ్యమే మహాభాగ్యమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టి.ఎన్.దీపిక అన్నారు. సడ్లపల్లిలోని ప్రశాంతనగర్‌లో 13వ వార్డు కౌన్సిలర్ సునీత, వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మైగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వందలాది మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు వైద్యులు శ్రీనివాసరెడ్డి, శరత్‌రెడ్డి తెలిపారు. శిబిరంలో నాయకులు జాఫర్‌వలి, ప్రణయ్‌రెడ్డి, శ్రీనాథ్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం


దాతలతో ఆలయ కమిటీ సభ్యులు

రొళ్ల: కాల్వేపల్లిలోని పురాతన రంగనాథస్వామి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మాణం చేపట్టిన కల్యాణ మంటపం నిర్మాణానికి దాతలు రూ.లక్ష నగదును విరాళంగా ఇచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. రంగనాథస్వామిని కొలిచే భక్తులు తమిళనాడులో వందలాది కుటుంబాలు ఉన్నాయి. దాతల ఆహ్వానం మేరకు కమిటీ సభ్యులు ఆ రాష్ట్రానికి చందా వసూలు చేయడానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆర్.రాజ్‌కుమార్, లక్ష్మీకాంతం, జె.రవి, మురళీధరన్, రాధాకుమార్, ఎస్.గౌడ, ఇ.రామచంద్రన్ రూ.లక్ష విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కాంతప్ప, రాజన్న, ఎస్.తిమ్మప్ప, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చింతపండు వ్యాపారి మృతి

హిందూపురం అర్బన్: ప్రముఖ చింతపండు వ్యాపారి నాగమోహన్ శనివారం మృతిచెందాడు. గతంలో తొమ్మిది సంవత్సరాల పాటు ఆయన మార్కెట్ కమిటీ కార్యదర్శిగా పనిచేశాడు. ఆయన మృతిపట్ల మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి కిశోర్, వ్యాపారులు సంతాపం వ్యక్తం చేశారు.

శభాష్.. వలంటీర్!

మడకశిరరూరల్/అమరాపురం: : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ సంక్షేమ పథకాలకు అర్హులకు వర్తింపజేయడంలో కీలకంగా పనిచేస్తోంది. తెల్లవారముందే తలుపుతట్టి మరీ పింఛన్ డబ్బులు అందజేస్తుండడంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మురిసిపోతున్నారు. తమ బాధలు తెలుసుకుని 1వ తేదీనే ఠంచన్‌గా పింఛన్ అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మేలును మరువలేమని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 1వ తేదీ అందుబాటులో లేని పింఛన్‌దారులు ఎక్కడున్నా వలంటీర్లు వెళ్లి పింఛన్ అందజేసి శెభాష్ అనిపించుకుంటున్నారు.

తుమకూరుకు వెళ్లి పింఛన్ అందజేత

మడకశిర మండలం గుండుమల గ్రామానికి చెందిన వలంటీర్ కర్ణాటక రాష్ట్రంలోని తుమకూరుకు వెళ్లి పింఛన్ అందజేసింది. వివరాలు.. గ్రామానికి చెందిన పింఛన్‌దారురాలు దుబ్బ నింగమ్మ తుమకూరులోని ఆస్పత్రిలో వైద్యం చేయించుకుని నిర్వహించుకుని అక్కడే విశ్రాంతి తీసుకుంటుంది. విషయం తెలుసుకున్న వలంటీర్ అఖిల దాదాపు 150 కి.మీ(రానుపోనూ) వెళ్లి నింగమ్మకు పింఛన్ సొమ్ము అందజేసింది.


పూజారప్పకు పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీర్ శైలజ

బెంగళూరుకు వెళ్లి..

అమరాపురం మండలం హాలుకూరు గ్రామానికి చెందిన పూజారప్ప గత పది రోజులు క్రితం అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులోని ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్లాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ శైలజ ఆదివారం బెంగళూరు(190 కిలోమీటర్లు) వెళ్లి పూజారప్పకు పింఛన్ సొమ్ము అందజేసింది.


నింగమ్మకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ అఖిల

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ

అమరాపురం మండలంలో మూడో రోజు ఆదివారం పింఛన్ల పంపిణీ ముమ్మరంగా సాగింది. ఈ సందర్భంగా వలంటీర్లు తమకు కేటాయించిన ఇళ్ల వద్దకు వెళ్లి వైఎస్సార్ పింఛన్ సొమ్మును అందజేశారు. మండలంలో 92 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు.

మార్బుల్, టెక్స్‌టైల్స్ కార్మికుల అభ్యున్నతికి కృషి

హిందూపురం: మార్బుల్ అండ్ టెక్స్‌టైల్స్ కార్మికుల అభ్యున్నతికి కృషి చేస్తామని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి అన్నారు. ఆదివారం పరిగి రోడ్డులోని మార్బుల్ అండ్ టెక్స్‌టైల్స్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మార్బుల్స్, టెక్స్‌టైల్స్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయా శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కరింప జేస్తామన్నారు. అలాగే కార్మిక యూనియన్ నాయకులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ ఆసీఫ్‌వుల్లా, రహమత్‌పుర్ ఫరూక్, సంఘ అధ్యక్షుడు షామీర్, ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు, సాదిక్, ప్రధానకార్యదర్శి గంగాధర్, కమిటీసభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి

జేవీవీ ఆధ్వర్యంలో సైన్సుపై అవగాహన

పెనుకొండ రూరల్: పట్టణంలోని గ్లోబల్‌జెన్ స్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్‌పై అవగాహన కల్పించారు. జేవీవీ రాష్ట్ర నాయకుడు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ సైన్స్ అభివృద్ధి చెందినా మూఢనమ్మకాలు కూడా అలానే ఉన్నాయన్నారు. సైన్స్‌పై అవగాహన ద్వారానే మూఢనమ్మకాలు దూరం చేసుకోవచ్చాన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సైన్సుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

6 నుంచి కృష్ణ జన్మాష్టమి వేడుకలు

హిందూపురం: పట్టణంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకూ కృష్ణజన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు ఆదినారాయణ తెలిపారు. ఆదివారం వేడుకల బ్రోచర్లను విడుదల చేశారు. స్థానిక ముద్దిరెడ్డిపల్లి భాగ్యనగర్ వద్ద 6వ తేదీ శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపుతో వేడుకలు ప్రారంభిస్తామన్నారు. శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి రోజూ పూజలు నిర్వహిస్తామన్నారు. 8వతేదీ మధ్యాహ్నం పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు అమర్, ఓబులేసు, రవి, శేఖర్, గోవర్ధన్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

అమరాపురం: మండల కేంద్రంలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ఆదివారం ఘనంగా శ్రీకృష్ణజాన్మాష్టమి వేడుకలను నిర్వాహకురాలు పుష్పలత ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలిత చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. చిన్నారులు రాధాకృష్ణ వేషధారణతో నృత్య ప్రదర్శన చేశారు. కృష్ణ జన్మాష్టమి ప్రాముఖ్యతను వివరించారు. చిన్నారులకు ప్రసాద వినియోగం చేశారు.

పిల్లలకు ఉత్తమ సంస్కారం నేర్పించండి

పావగడ: తల్లిదండ్రులు పిల్లలకు సత్యం ధర్మంతో పాటు ఉత్తమ సంస్కారం నేర్పించాలని స్థానిక ధర్మస్థలం గ్రామీణ అభివృద్ధి యోజన జిల్లా డైరెక్టర్ దినేశ్ సూచించారు. తాలూకా లోని బ్యాడనూరులో ప్రగతి బంధు స్వయంసహాయక సంఘాల కూటమి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ధార్మిక సభలో ఆయన మాట్లాడారు. ధార్మిక ఆచరణలు నిలవాలంటే పిల్లల్లో ధార్మికతపై అవగాహన కల్పించాలన్నారు. ఆలయాలు పూజలు, ధార్మిక ఆచరణలకే పరిమితం కాకుండా సామాజిక సేవలందించి సమాజంలో నెలకొన్న సమస్యలకు స్పందించే కేంద్రాలు కావాలన్నారు. నిడుగల్ వాల్మీకి ఆశ్రమాధిపతి వాల్మీకి సంజయ కుమారస్వామి మాట్లాడుతూ ధర్మస్థల గ్రామీణ అభివృద్ధి సంస్థ అధినేత వీరేంద్ర హెగ్గడె మార్గదర్శనంలో తాలూకా వ్యాప్తంగా అందిస్తున్న అనేక ప్రజా సంక్షేమ యోజనలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్‌బీఎం బ్యాంకు మేనేజర్ కే చంద్రశేఖర్ తదితర సంస్థ యోజనాధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సంజయ కుమార స్వామిజీ

భక్తిశ్రద్ధలతో గణపతి పూజలు

హిందూపురం: సంకష్టహర చతుర్థిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి వినాయక ఆలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. శ్రీనివాసనగర్, బెంగళూరురోడ్‌లోని గణపతి ఆలయంలో ఉదయం, సాయంత్రం మహాగణాధిపతికి పంచమృతాభిషేకాలు చేసి విశేషంగా పూజలు చేపట్టారు. సాయంత్రం విశేష పుష్పాలంకరణ, గరకతోపాటు కుడుముల హారాలు, ఆకుల తోరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి ఉపవాసదీక్షలు నిర్వహించి రాత్రి ఆలయానికి చేరుకుని గణపతికి పూజలు చేసి కుంకుర్చనలు జరిపించారు. అలాగే భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించి ఉపవాస దీక్షలను విరమించారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

గోరంట్ల: మండలంలోని వానవోలుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సొట్టొల్ల రామచంద్ర ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. రామచంద్ర మృతదేహాన్ని నాయకులు సందర్శించి, పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సచివాలయ ఉద్యోగులు మృతుడి భార్య సుజాతమ్మకు వైఎస్సార్ ప్రమాద బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు అందించారు. మిగతా సొమ్ము ప్రభుత్వం త్వరలో నామినీ ఖాతాకు జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాబు, నాయకులు ఓబుళరెడ్డి, శ్రీనివాసులు, సచివాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పెనుకొండ రూరల్: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన నగర పంచాయితీ పరిధిలోని కోనాపురంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన సురేష్ ఆదివారం రాత్రి కుటంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు సూచన మేరకు అనంతపురం ఆస్పత్రికి తరలించారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సురేష్

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

అమరాపురం: హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి భక్తులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామికి ఉదయం సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. శ్రావణమాసం సందర్భంగా మడకశిర నియోజకవర్గం నుంచేగాక సమీప కర్ణాటక ప్రాంతాలైన శిర, హిరియూర్, బెంగళూరు, మైసూరు, తుమకూరు, మధుగిరి, పావగడ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వినియోగం చేశారు.

రొళ్ల: టీడీపల్లి గ్రామ సమీపాన అటవీ ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం మూడో ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని నీటితో శుభ్రం చేసి పూలతో అలంకరించారు. తర్వాత స్వామి మూల విగ్రహాన్ని గంగా జలంలో అభిషేకించారు. అనంతరం స్వామివారి ప్రతిమకు వెండి ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహామంగళారతి చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు ఆలయ ఆవరణలో వంటకాలు చేసి స్వామి ఎదుట నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు.

యథేచ్ఛగా చెరువుమట్టి తరలింపు

పెనుకొండ రూరల్: మండలంలోని మరువపల్లి, కొండాపురం చెరువుల్లోని మట్టిని ఎలాంటి అనుమతి తీసుకోకుండా అడ్డగోలుగా తరలించి, వ్యాపారం చేసుకుంటున్నారు. అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కియా పరిశ్రమరాకతో పెనుకొండ పట్టణ, పరిసర ప్రాంతాల్లో గృహ నిర్మాణాలకు విపరీతమైన గిరాకీ పెరిగింది. ఇదే అదునుగా చూసుకొని కొందరు వ్యాపారులు, ఇటుకల బట్టీ నిర్వాహకులు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. మండలంలోని మరువపల్లి, కొండాపురం చెరువుల్లోని మట్టిని ఎడా,పెడా తోడేస్తూ ఒక ట్రాక్టర్ రూ.800 నుంచి రూ.1500 వరకు విక్రయిస్తున్నారు.


మరువపల్లి చెరువులో మట్టి తరలించటానికి సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం

మడకశిర: పట్టణంలో ఈఏడాది గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఈనెల 18 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఆదివారం ఉత్సవాల కమిటీ సభ్యులు పట్టణంలోని కొల్లాపురమ్మ ఆలయంలో సమావేశమై ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. పట్టణంలో అన్ని ప్రాంతాల్లో కూడా గణేష్ ప్రతిమలను ప్రతిష్టాపన చేయాలని ఆయా ప్రాంతాల కమిటీ సభ్యులు నిర్ణయించారు. ప్రతిమల ప్రతిష్టాపనకు ముందుగానే పోలీసులు, విద్యుత్ అధికారుల నుంచి కూడా అనుమతి తీసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఇప్పటి నుంచే గణేష్ ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.


సమావేశమైన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు

నేడు రొళ్లలో డివిజన్ స్థాయి 'స్పందన'

రొళ్ల: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పెనుకొండ సబ్ కలెక్టర్ కె.కార్తీక్ ఆద్వర్యంలో డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. కార్యక్రమానికి డివిజన్ స్థాయిలో ఉన్న అన్ని శాఖల అధికారులు హాజరవుతారన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు


విద్యుత్‌షాక్‌కు గురైన సోమశేఖర్

పెనుకొండ రూరల్: విద్యుత్‌షాక్‌కు గురై యువకుడు గాయపడిన ఘటన మడకశిర రోడ్డులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు.. రొద్దం గ్రామానికి చెందిన సోమశేఖర్ ఇనుప కడ్డీలు భుజంపై తీసుకెళ్తుండగా, కర్ణాటక బ్యాంకు ఎదురుగా ఉన్న ఫారంకి కడ్డీలు తగిలి, విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతన్ని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి..


గాయపడిన చంద్రశేఖర్‌రెడ్డి

చిలమత్తూరు: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. ఆదివారం బాగేపల్లి టోల్‌ప్లాజా సమీపంలో ఆదేపల్లి క్రాస్ వద్ద ద్విచక్ర వాహనంలో వెళుతూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి క్రింద పడిపోయాడు..ఎడమచేయికి, మెహంపై తీవ్ర గాయాలు కావడంతో అతడిని బాగేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి ప్రమాద ఘటనపై ఆరా తీసి, కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

వ్యక్తి ఆత్మహత్య


నారాయణ(ఫైల్)

రొద్దం: మండలంలోని తురకలాపట్నం గ్రామానికి చెందిన బి.నారాయణ (38) అప్పులబాధ తాళలేక ఉరివేసుకొని ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. నారాయణ తల్లిదండ్రుల పేరుమీదున్న పొలంలో వ్యవసాయం చేస్తున్నాడు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ.5 లక్షల దాకా అప్పు చేశాడు. దీనికితోడు తాగుడుకు బానిసయ్యాడు. అప్పు తీర్చేమార్గంలేక ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సువర్ణ, ఇద్దరు కొడుకులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బెనవన్న, ఈరలింగస్వాములకు ప్రత్యేక పూజలు

అమరాపురం: బంగారు పాళ్యం గ్రామానికి వెళ్లే రహదారిలో వెలసిన వక్కలిగుల కుల దైవం బెనవన్న, ఈరలింప్ప స్వాములకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం పురస్కరించుకుని ఏటా మూడో ఆదివారం దేవతలకు పూజలు చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు గంగా జలంతో బెనవన్న, ఈరలింగప్ప విగ్రహాలను శుద్ధి చేశారు. అనంతరం వివిధ రకాల పూజలు నిర్వహించారు. అలాగే అక్కడే ఉపవాస దీక్షతో వంటలు వండుకుని దేవతలకు నైవేద్యం పెట్టి ప్రత్యేకంగా మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదానం చేశారు.


అలంకరణలో ఈరలింగప్పస్వామి

వర్షం కోసం మట్టి బొడ్రాయి ఊరేగింపు

రొళ్ల: వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తు కొడగార్లగుట్ట గ్రామంలో యువకులు మట్టితో తయారు చేసిన బొడ్రాయిని గ్రామంలో ఊరేగించారు. ఇలా చేయడం వల్ల వారం రోజుల్లోగా వర్షాలు కురుస్తుందని గ్రామస్తుల నమ్మకం. అనంతరం గ్రామం నడిబొడ్డున ఉన్న పురాతన బొడ్రాయికి 101 బిందెల నీటితో అభిషేకం చేసి వరుణ దేవుడు కరుణ చూపాలని ప్రత్యేకంగా పూజలు చేశారు. తర్వాత గ్రామ సమీపాన కుంటలో మట్టి బొడ్రాయిని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ప్రసాదాన్ని తయారు చేసి అందరికీ పంచి పెట్టారు.


కొడగార్లగుట్టలో వర్షం కోసం మట్టి బొడ్రాయితో ఊరేగిస్తున్న యువకులు

కృష్ణాష్టమి వేడుకలకు ఇస్కాన్ సిద్ధం

అనంతపురం కల్చరల్: జిల్లాలోనే వైభవంగా సాగే శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ఇస్కాన్ మందిరం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఆదివారం మందిరంలో జరిగిన సమావేశంలో ఇస్కాన్ చైర్మన్ దామోదర గౌరవంగదాసు వివరాలు అందించారు. ఈనెల 6 నుంచి మూడు రోజుల పాటు వేడుకలు వైభవంగా సాగుతాయని, బుధవారం విశ్వశాంతి యజ్ఞం, హరినామ సంకీర్తనతో ప్రారంభమై సాయంత్రం చిన్నారుల కృష్ణ వేషధారణలు, సాంస్కృతిక సంబరాలు, గురువారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా రాధా పార్థసారథులకు పుష్పాభిషేకం, శృంగారహారతి, సురద్శన హోమం సాయంత్రం తెప్పోత్సవం, ఊంజల సేవ ఉంటాయన్నారు. చివరిరోజు శ్రీకృష్ణ రథయాత్ర జరుగుతుందన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని పోతులనాగేపల్లి వద్ద ఆదివారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ప్రవీణ్ అనే చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. బుక్కపట్నం మండలం సిద్ధిరాంపురం గ్రామానికి చెందిన చెన్ను, శ్యామల దంపతులు తమ కుమారుడు ప్రవీణ్‌తో కలిసి ధర్మవరం నుంచి బుక్కపట్నం గ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. పోతులనాగేపల్లి సమీపంలో చేరుకోగానే వీరు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులకు స్వల్ప గాయాలు కాగా.. చిన్నారి ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డాడు. చిన్నారిని చికిత్స నిమిత్తం ధర్మవరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

లేపాక్షి ఆలయంలో పూజలు

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి కాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన పర్యాటకులతో ఆలయం కిక్కిరిసిపోయింది. నాట్యమంటపం, కల్యాణ మంటపం, ఏడు శిరస్సుల నాగేంద్రుని విగ్రహం, సీతమ్మ పాదం, వేలాడే స్తంభం తదితర శిల్పాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. అదేవిధంగా జటాయువు పక్షి విగ్రహం, నంది విగ్రహం, జటాయువు పార్కు తదితర ప్రాంతాల్లో పర్యాటకులు సందడి చేశారు. భక్తులకు అన్నదాన సత్రంలో కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన

మడకశిరరూరల్: మండలంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునే విధంగా గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఏఓ తిమ్మప్ప తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాభావం నేపథ్యంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ తక్కువ విస్తీర్ణంలో సాగైందన్నారు. వేరుశనగ పంట సాగు చేయని భూముల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా ఆర్బీకేల పరిధిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 1,500 మంది రైతులు సబ్సిడీ ఉలవలకు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రెండున్నర వేల ఎకరాలకు పైగా రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా చర్యలు చేపట్టామన్నారు. 10 కేజీల ఉలవల బ్యాగు సబ్సిడీ పోనూ రైతు కేవలం రూ.218 చెల్లించాలన్నారు. సబ్సిడీ ఉలవలు సాగు చేయి రైతులు ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు వైస్ ఎంపీపీ -2 ఎన్నిక

చెన్నేకొత్తపల్లి: మండల పరిషత్ ప్రాదేశిక ఉపాధ్యక్షుడు – 2 వైస్ ఎంపీపీ ఎన్నిక సోమవారం నిర్వహిస్తున్నట్లు ప్రొసీడింగ్ అధికారి గోపాలరెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరగనున్న సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు తప్పక హాజరు కావాలన్నారు.